క్లుప్తంగా

సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాం



సత్తెనపల్లి: తాత, తండ్రి నుంచి ఆస్తులు వారసత్వంగా పొందటమే కాదని, వారి సేవా, ఆదుకొనే తత్వాన్ని కూడా తాము కొనసాగిస్తామని కీర్తిశేషులు త్రిపురమల్లు బుల్లి కోటయ్య మనవళ్లు అన్నారు. పట్టణ మాస్టిన్‌పేటలోని జ్యోతి ఫౌండేషన్‌లో భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో 718వ రోజు పట్టణానికి చెందిన దానశీలి కీర్తిశేషులు త్రిపురమల్లు బుల్లి కోటయ్య పుణ్యతిథి సందర్భంగా వీరి కుమారుడు పెద బ్రహ్మేంద్రరావు ఆర్థిక సహాయంతో వీరి కుమారులు చేతులమీదుగా 121 మంది నిరుపేదలకు శుక్రవారం భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా పెద బ్రహ్మేంద్రరావు కుమారులు సాంబశివరావు, రామగుప్త, హనుమత్ కుమార్‌లు ఈ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి దాతలకు, వారి కుటుంబ సభ్యులకు, సేవలు అందించిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘ కాలంగా ఈ పథకం కొనసాగిస్తున్న న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావుకు, రుచికరమైన భోజనాన్ని అందించిన ఓగిబోయిన కొండలుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సత్తెనపల్లి: గృహ, పెన్షన్, వైద్యం పలు సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని, ఆయా సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా శుక్రవారం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచనలు చేశానన్నారు.

మాజీ ఎమ్మెల్యే శంకరరావును కలిసిన పెదబాబు



క్రోసూరు: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన చిల్కా పెదబాబు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పెదబాబు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును మర్యాదపూర్వకంగా గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. నంబూరు శంకరరావు పెదబాబును శాలువాతో సత్కరించి అభినందించారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఈ సందర్భంగా పె దబాబు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. విప్పర్ల గ్రామ పార్టీ నా యకులు, మాజీ సర్పంచ్ నర్రా వాసుదేవరావు, లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా అంకమ్మ తల్లి



పెదకూరపాడు: చల్లంగా చూడమ్మా అంకమ్మ తల్లి అంటూ భక్తులు పెద్ద సంఖ్యలో పెదకూరపాడు గ్రామ దేవత అంకమ్మ తల్లికి ఆషాడ మాస పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంకమ్మ తల్లి అమ్మవారిని శుక్రవారం శాకాంబరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్ల నివేదన గావించారు. శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీధర్, ఉపాధ్యక్షుడు దుప్పటి చిన్న బాబు, కార్యదర్శి కర్ణం శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో అమ్మవారిని శాకంబరిగా కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భజన మాస్టర్ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ భక్త సమాజాల వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అటకెక్కిన ఉచితం.. అన్నదాతపై భారం

- ప్రీమియం రైతులే చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేసిన కూటమి సర్కార్
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లింపు



అచ్చంపేటలో వేసిన పత్తి పంట

అచ్చంపేట: ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. బీమా పొందాలంటే ప్రీమియం సొమ్ము రైతులే భరించే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది పత్తి, మిర్చి, వరి పంటలు వేసి సరైన సమయంలో వర్షాలు లేక పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడ్డ అన్నదాతలకు బీమా ప్రీమియం సొమ్ము కూడా తోడైంది. విత్తనాల కొనుగోలుగే డబ్బులు లేక ఇంట్లో నగలు తాకట్టు పెట్టుకోవాల్సిన పరిస్థితుల్లో ఉన్న రైతులకు బీమా ప్రీమియం చెల్లింపు అదనపు భారమైంది. ప్రభుత్వం నుంచి ఏ ప్రోత్సాహం అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి, ఉచిత పంటల బీమా అందిస్తే, ఆ పథకాన్ని అటకెక్కించిన కూటమి పాలనపై రైతులు మండిపడుతున్నారు.

20 వేల హెక్టార్ల సేద్యం

మండలంలో దాదాపు 20 వేల హెక్టార్ల సేద్యపు భూములున్నాయి. ప్రధానంగా పత్తి, మిర్చి, వరి, కంది, మొక్కజొన్న, పసుపు, పొగాకు పంటలు పండిస్తారు. ముందస్తుగా మే నెలలో వర్షాలు కురవడంతో రైతులు చాలా భాగం పత్తి పంటలు వేశారు. ప్రీమియం చెల్లిస్తే గాని విపత్కర పరిస్థితులలో బీమా వర్తించదని వ్యవసాయ శాఖ చెబుతుంది. ఒక్కో పంటకు ఒక్కో రకం ప్రీమియాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. వరికి రూ.80, మిర్చికి ఎకరాకు రూ.360, కందికి రూ.40, పత్తికి రూ.1,900 మొక్కజొన్నకు రూ.66గా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రీమియం చెల్లింపు పత్తికి ఈ నెల 15తో ముగియగా, మిగిలిన పంటలకు ఈ నెలాఖరు వరకు గడువు విధించింది. బీమా ప్రీమియం కూడా చెల్లించాల్సి రావడంతో అచ్చంపేట మండలంలో మూడొంతులకు పైగా రైతులు ప్రీమియం చెల్లించలేదు.

రైతులపై అదనపు భారం

గత ఏడాది కాస్తోకూస్తో పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం ఈ ఏడాదైనా ఆదుకుంటుందని గంపెడాశతో ఉన్న రైతులపై ప్రీమియం భారం కూడా వేయడాన్ని అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రతి రైతు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందో ఇంతవరకు స్పష్టత లేదు.

అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతలను ఎన్ని విధాలుగా ఆదుకోవాలో అన్ని విధాలా ఆదుకుంది. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలను స్థాపించింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేయడమే కాకుండా అధిక దిగుబడులు సాధించేందుకు ప్రత్యేక సిబ్బందితో సూచనలు, సలహాలు ఇప్పించింది. దాని ఫలితమే 2023–24 సీజన్‌లో మిర్చి క్వింటా రూ.23 వేలు పలికింది. కూటమి సర్కారు రాగానే రూ.10 వేలకు పడిపోయింది. వేసిన పంటలను ఈ–క్రాప్ చేయించిన ప్రతి రైతుకు ఉచిత పంటల బీమాను జగన్ సర్కార్ అమలు చేసింది.

ప్రభుత్వం పునరాలోచించాలి



ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా ఉన్న ఉచిత బీమా పథకాన్ని కూడా ఎత్తేయడం దారుణం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కరోనా కష్ట కాలంలో కూడా ఉచిత బీమాను కొనసాగించి రైతులను ఆదుకుంది. ప్రీమియం చెల్లింపుపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి.

– మర్యాద శ్రీనివాసరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

ప్రభుత్వమే చెల్లించాలి



ఇచ్చిన హామీ మేరకు ఇంతవరకు అన్నదాత సుఖీభవ ఎలాను ఇవ్వలేదు. కనీసం ఉచిత పంటల బీమా అయినా అమలు చేయాలి. గతంలో లాగా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించి రైతులను ఆదుకోవాలి. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం అందజేయాలి.

– పల్లప్రోలు వెంకటరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

ప్రీమియం చెల్లించిన వారికే బీమా



ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రీమియం చెల్లించిన వారికే బీమా వర్తిస్తుంది. పత్తికి గడువు ముగిసింది. మిగిలిన పంటలకు ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. మండలంలో ఇప్పటి వరకు సగం మంది రైతులు కూడా ప్రీమియం చెల్లించ లేదు. విపత్కర పరిస్థితుల్లో ప్రీమియం చెల్లించకుండా పరిహారం రావడం కష్టం.

– పి.వెంకటేశ్వర్లు, ఏవో, అచ్చంపేట

కంభంపాడులో మంత్రుల పర్యటన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

పెదకూరపాడు: మండలంలోని కంభంపాడులో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటించారు. ఈ సందర్భంగా రూ.1.50 కోట్లతో నిర్మించిన జలాలపురం –కంభంపాడు రోడ్డును ప్రారంభించారు. రూ.2 కోట్లతో కంభంపాడు–ఉంగుటూరు వరకు నిర్మించనున్న తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ రానున్న నాలుగు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయి మద్దతు ఇస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్న సాంబశివరెడ్డి, అర్తిమల్ల రమేష్, ఏటుకూరి బ్రహ్మయ్య, పాటిబండ్ల బాలయ్య, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



షేక్ గన్ సైదా కుటుంబాన్ని పరామర్శిస్తున్న నంబూరు శంకరరావు

పెదకూరపాడు: అధైర్య పడొద్దు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పఠాన్ మస్తాన్ వలి కుమారుడు మాబు, షేక్ ఘన్ సైదా, షేక్ అల్లాబక్షు ఇటీవల మరణించారు. నంబూరు శంకరరావు శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. వారి వెంట ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య, జిల్లా పార్టీ నాయకుడు కంకణాల శివాజీ, వైస్ ఎంపీపీ బాషా, సుభాని, బాజీ, రఫీ, ఆదం షఫీ, రంజాన్ షరీఫ్, షేక్ యాసిన్ తదితరులు ఉన్నారు.

పోలీసులు జులుం ప్రదర్శించారని రహదారిపై ధర్నా


న్యాయం చేయాలని బాధితుల ఆందోళన



రాజుపాలెం బస్టాండ్ సెంటర్‌లో మాచర్ల-గుంటూరు రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

రాజుపాలెం: భార్యాభర్తల మధ్య వివాదం నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు రాగా బాధితులమైన తమపై పోలీసులు జులుతం ప్రదర్శించారని బాధితులు వాపోయారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ మాచర్ల–గుంటూరు రహదారిపై రోజుపాలెం బస్టాండ్ సెంటర్‌లో బైఠాయించారు. న్యాయం చేయమని వస్తే తమపై దాడి చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి టౌన్ సీఐ నాగమల్లేశ్వరరావు రంగ ప్రవేశం చేసి నిరసన తెలుపుతున్న వారితో మాట్లాడి సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన ఎస్‌కే అబ్దుల్‌ఖరీమ్‌తో తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన ఎస్‌కే నగీనాకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. గత కొన్నేళ్లుగా అక్రమ సంబంధం నెరుపుతున్న భర్త తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడని భార్య పోలీసులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో పోలీసులు న్యాయం చేయకపోగా తమపైనే దాడి చేశారని ఆగ్రహించిన భార్య, బంధువులు కలసి రోడ్డుపై ధర్నాకు దిగారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. సీఐ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రైతును ఏమార్చి నగదు అపహరణ



సత్తెనపల్లి: రైతును మోసగించి రూ.20 వేలు యువకుడు అపహరించిన ఘటన సత్తెనపల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ వద్ద శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన రైతు సత్తెనపల్లి వీరయ్య కుటుంబ అవసరాల నిమిత్తం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లోని తన ఖాతాలో రూ.21 వేలు నగదు ఉండగా రూ.20 వేలు డ్రా చేసేందుకు వచ్చాడు. అయితే వీరయ్య చదువుకోక పోవడంతో అక్కడ ఉన్న యువకుడిని పిన్ నెంబర్ కొట్టమని కార్డు ఇచ్చాడు. ఇదే అదనుగా భావించిన యువకుడు ఏటీఎం కార్డును ఏమార్చి వేరే కార్డు రైతు చేతిలో పెట్టి రూ.20 వేలు నగదు డ్రా చేసుకొని అక్కడి నుంచి ఉడాయించాడు. దీంతో మోసపోయినట్టు గ్రహించిన రైతు వీరయ్య లబోదిబోమంటూ పట్టణంలోని బంధువులకు తెలియజేయగా వారి ద్వారా పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన చేతిలో పెట్టిన ఏటీఎం కార్డ్‌పై ఆదినారాయణ అనే పేరు ఉందని, ఏటీఎం వద్ద సీసీటీవీ ఫుటేజ్‌లో కూడా రికార్డ్ అయిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో సీఐ నాగమల్లేశ్వరరావు స్పందించి వెంటనే సిబ్బందిని ఏటీఎం వద్ద సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించమని ఆదేశించారు.

సత్తెనపల్లి ఏడీఏగా రవిబాబు

సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) గా బోయపాటి రవిబాబును నియమించారు. వ్యవసాయ శాఖలో గత నెల 9న బదిలీలు జరిగినప్పటికీ వాటిల్లో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దానిలో భాగంగా వినుకొండ ఏడీఏగా విధులు నిర్వహిస్తూ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి అటాచ్‌మెంట్ నిమిత్తం వచ్చిన రవిబాబును సత్తెనపల్లికి బదిలీ చేశారు. ఇప్పటి వరకు సత్తెనపల్లి ఏడీఏగా ప్రస్తుతం ముప్పాళ్ళ మండల వ్యవసాయ అధికారి ఐ.శ్రీధర్ రెడ్డి కొనసాగుతున్నారు. సోమవారం రవిబాబు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

సత్తెనపల్లి: సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో నల్లబర్లీ పొగాకు సాగు చేసే రైతులకు ఉపయోగకరంగా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సంప్రదింపులు జరిపి కొత్తగా సత్తెనపల్లికి పొగాకు కొనుగోలు కేంద్రం మంజూరు అయినందున రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం కోరారు.

ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలి

ముప్పాళ్ళ: ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పీ రమాదేవి చెప్పారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారి రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందుతున్నాయని, గర్భిణులకు గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్.వి.వెంకాయమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ముప్పాళ్ళ: విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11కేవీ దమ్మాలపాడు ఫీడర్ లైన్ మరమ్మతులలో భాగంగా ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 19వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జీ సుచరిత శుక్రవారం తెలిపారు. ఫీడర్ పరిధిలోని బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం, పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

జాతీయ అవార్డు గ్రహీత మురళికి సత్కారం



సత్తెనపల్లి: జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డ్‌కు ఎంపికైన సత్తెనపల్లి 31వ వార్డుకు చెందిన కర్నాటి మురళిని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని 31వ వార్డులో గల తన ఇంటిని సందర్శించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో ఇక్కత్ డిజైన్లపై శిక్షణ ఇస్తున్న కర్నాటి మురళి ఆగస్టు 7న ఢిల్లీలో భారత్ భవనంలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకోనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, న్యాయవాదులు రాజారపు శివనాగేశ్వరరావు, చలువాది చిన సత్యనారాయణ, పెన్షనర్లు మక్కపాటి ప్రసాద్, డి.శివకోటయ్య, యెల్లినేడి రామారావు, గద్దె మురహరిరావు, డి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పీటీఎం సమావేశాలకు ప్రజా ప్రతినిధులు అవసరం లేదా..!

మండల పరిషత్ సమావేశంలో ఎంఈవోని ప్రశ్నించిన ఎంపీపీ స్వర్ణమ్మభాయ్



ఎంఈవో ప్రసాదరావును ప్రశ్నిస్తున్న ఎంపీపీ స్వర్ణమ్మభాయ్


అచ్చంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మెగా పీటీఎం (పేరెంట్ టీచర్ మీటింగ్)లు ఎలా నిర్వహిస్తారు. ప్రజా ప్రతినిధులు అవసరం లేదా... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని అలా ఎలా నిర్వహిస్తారు అని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయ్ ఎంఈవో ఏకుల ప్రసాదరావును ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రభుత్వ పాఠశాలల పనితీరు, మెనూ ప్రకారం భోజనం, ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారం ఫీజుల వసూళ్ల తదితర విషయాలపై ఎంఈవోపై ప్రశ్నల వర్షం కురిపించారు.

- పీటీఎం సమావేశంలో తల్లిదండ్రులు, విద్యార్థులేనా... ప్రజా ప్రతినిధులు లేకపోతే పాఠశాలలో సమస్యలు ఎలా పరిష్కారమవుతాయన్నారు. గురుకుల పాఠశాల తనిఖీకి వెళితే తనకే స్టాక్ వివరాలు చెప్పలేదని, అప్పటికే రెండు రోజులపాటు విద్యార్థులకు గుడ్లు ఇవ్వలేదని తెలిసిందన్నారు. ఉపాధ్యాయులు ప్రొటోకాల్ అతిక్రమిస్తున్నారని, కేజీబీవీలో జవాబుదారీ విధానం లోపించిందన్నారు.
- ప్రతి పీటీఎం సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్ తప్పనిసరిగా ఉండే విధంగా ఉత్తర్వులు పంపాలని ఎంపీపీ ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు అధికంగా వసూలు చేస్తూన్నారని, ఫీజు చెల్లించని వారికి టీసీ ఇవ్వడం లేదన్నారు. టీసీలు ఇచ్చేందుకూ వేల రూపాయలు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లోనూ స్కూల్ ఫండ్ పేరుతో విద్యార్థుల నుంచి గుంజుతున్నారన్నారు. వెంటనే ఈ పద్ధతులను మార్చుకోవాలని, ప్రతి పాఠశాలలో ఫీజు వివరాలతో బోర్డులు పెట్టించాలన్నారు.
- ఏవో పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకాన్ని మూడు విడతలలో అమలు పరచనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే దాంతో కలిపి మొదటి రెండు విడతలలో రూ.7 వేలు చొప్పున చివరి విడతగా రూ.6 వేలు నేరుగా రైతు బ్యాంకు ఖాతాకు జమ చేస్తారని చెప్పారు. ఈ పథకం పొందాలంటే ప్రతి రైతు తమ పొలానికి ఆధార్ లింక్ చేయించుకోవాలని, ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ఇంటికి ఒక్కరికి మాత్రమే, ఈ మ్యాపింగ్‌లో ఉన్న వారికే ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.


గైర్హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు జరగాల్సి ఉండగా 12.30 గంటలకు ప్రారంభించారు. 17 మంది ఎంపీటీసీలకు గాను ఆరుగురు, 23మంది సర్పంచులలో సగం మంది కూడా హాజరు కాలేదు. 14 ప్రభుత్వ శాఖలు ఉండగా విద్య, వ్యవసాయం, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్ అధికారులు మాత్రమే హాజరయ్యారు. నియోజకవర్గంలో ఇద్దరు మంత్రులు పర్యటిస్తున్నందు వల్ల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రాలేకపోయారని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు సమర్థించుకున్నారు.

బాబు మోసాన్ని ప్రజలకు వివరిద్దాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకరరావు



హాజరైన అమరావతి, పెదకూరపాడు నాయకులు, కార్యకర్తలు

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: చంద్రబాబు ఎన్నికల నాటి నుంచి నేటి వరకు చేసిన మోసాలను ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని పెదకూరపాడు మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏవీఆర్ కల్యాణ మండపంలో అమరావతి, పెదకూరపాడు మండలాల స్థాయిలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అమరావతి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. నంబూరు శంకరారావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజలు అడగని వాటిని కూడా అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు, లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి అని యువతను, అలాగే బీసీ, ఎస్సీలకు 50 ఏళ్లకే పింఛన్, రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు.. ఇలా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని గ్రామాలలో చంద్రబాబు హామీలతో ఎంత నష్టపోయారో వివరించాలన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి చంద్రబాబు మోసాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జననేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం నుంచి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటీ కోటేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అన్నపాములు, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, అమరావతి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రచార కార్యదర్శి షేక్ సినిమా హాల్ బాజీ, పెదకూరపాడు మండలాల నాయకులు కంకణాల శివాజీ, చిలకా సాంబయ్య, నాయుడు రాంబాబు, అళ్ల శ్రీనివాసరెడ్డి, బచ్చు హనుమంతరావు, షేక్ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

నూతన మోటార్లు ఏర్పాటు



మోటార్లను ప్రారంభిస్తున్న డీఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు

బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలోని రక్షిత మంచినీటి పథకంలో శుక్రవారం నూతన విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పథకంలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని అన్నారు. దీంతో రూ.2.5 లక్షల వ్యయంతో రెండు నూతన విద్యుత్ మోటార్లను అమర్చినట్లు తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, ఏఈలు మల్లికార్జునరావు, రమణ, నీటి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ ఏర్పాటుకు పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అరుణకుమారి

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నూతన పోలింగ్ బూత్ ఏర్పాటు చేసేందుకు శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలన చేశారు. గ్రామంలో బూత్ నెంబర్ 23, 24, 25 మూడు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. కాగా 23వ బూత్ లో అధిక ఓట్లు ఉన్నందువలన మరో అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటుకు అధికారులు సూచించారు. దీంతో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ కె.అరుణ కుమారి గ్రామ రెవెన్యూ సిబ్బందితో కలిసి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. వారి వెంట ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ సింగారెడ్డి బ్రహ్మారెడ్డి, నాయకులు బత్తుల వెంకట్రావు, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, సిద్ధల రాజేష్ తదితరులు ఉన్నారు.